


# నేలను నమ్మితే...?

‘నేల మోసం చేస్తుందా...మనిషి మోసకాడయితే కావచ్చు కాని నేలెలా అవుతుంది...? భూమిని నమ్మడం కంటె అమ్మడం మంచిదా? మనం పుట్టింది మట్టిలో... పెరిగేది మట్టిలోనే... పోయేది మట్టిలోనే... ఎన్నిటికైనా మనల్ని ఆదుకునేది మట్టే... చదువేస్తే ఉన్న మతి పోయినట్టు చేస్తున్నాడు కొడుకు... తరతరాలుగా భూమినే నమ్ముకొని బతుకుతున్న వంశం... చదువుకొని నౌకరీ చేస్తున్నంత మాత్రాన భూమి ఉండొద్దా? అమ్మతాడట భూమిని అమ్మితే తల్లిని అమ్ముకున్నట్టే... వీడిదేం పుట్టుక...?’

లబోదిబోమని తిట్టుకుంటున్నాడు కొండయ్య. మొత్తుకుంటున్నాడు... అటూ ఇటూ తిరుగుతున్నాడు. లోపలకు పోయున్న డొక్కలెగిసి పడుతుండగా బురుక పిట్టలా ఉరుకుతున్నాడు... కళ్లవెంట కారుతున్న నీటిని నెత్తిమీదున్న రుమాలుతో తుడుచుకుంటున్నాడు.

‘తరతరాలుగా భూమినే నమ్ముకొని బతుకుతున్న తనవాళ్లు పొందిందేంటి? అప్పులే కదా? అయినా తన తండ్రికి భూమ్మీదంత ప్రేమెందుకు? ఏమిచ్చిందని భూమి? భూమిని నమ్మాలట... అమ్మొద్దట...’ తనలో తాననుకుంటూ చికాకు పడుతున్నాడు

డా॥ కాలువ మల్లయ్య



లక్ష్మణ్.

భూమి విషయంలో తండ్రీకొడుకుల మధ్య చాలా రోజులుగా ఘర్షణ జరుగుతూనే ఉంది... కొండయ్య ఇంటి ముందు వాతావరణం వేడివేడిగా ఉంది. ఇంతలో వాళ్లెదురు చూస్తున్న పోచన్న రానేవచ్చాడు. వాకిట్లో వాల్చున్న మంచంలో కూర్చున్నాడు... అక్కడున్న గంభీర వాతావరణాన్ని గమనించాడు.

“ఏంటే...? తండ్రీకొడుకులిద్దరూ ఏదో మునిగిపోతున్నట్టు సీరియస్‌గా ఉన్నారు... మహమ్మదుగారి దగ్గరకు కొండ రానప్పుడు కొండ దగ్గరకు మహమ్మదుగారు పోవాలి కదా” అన్నాడు నవ్వుతూ...

“పోచన్న భలేచాలు.. కఱ్ఱా విరగొద్దు... పామూ చావద్దన్నట్టుంటాయి పోచన్న మాటలు... కొండయ్యా, లక్ష్మణ్ ఇద్దరూ ఇద్దరే... ఒకరికి భూమంటే ప్రాణం... ఇంకొకరికి భూముంటే నష్టం.... ఇందులో పంచాయితీ చేసుకోటానికేముంది? తండ్రవు కొడుకవు” అన్నాడు మల్రెడ్డి.

“ఇండ్ల పంచాయితేముంది? నా కొడుకు పెద్ద చదువులు చదివాడు గదా! భూమిని అమ్మాలంటున్నాడు. నేనమ్మనియ్యా... చచ్చినా బతికినా నేనూ భూమిల్నే... వానికి గడ్డి పెడతారని పిలిచిన..”

ఆవేదనతో, ఆగ్రహంతో అన్నాడు కొండయ్య. పరస్థితినర్థం చేసుకున్నాడు పోచన్న.

“లక్ష్మన్నా! మీ నాన్నకు భూమి మీదున్న ప్రేమ నీకు తెలియంది కాదు. ఇప్పుడా భూమిని అమ్మాల్సిన అవసరమేముంది?” అన్నాడు.

మిత్రుడి మాటలకు గంయ్‌మని లేచాడు లక్ష్మణ్.

“పెద్ద మనిషని పేరంటం బిలిత్తె గిద్దెడు వసువు ముడ్డికి రాసుకున్నదన్నట్టుంది నీ సంగతి... డిగ్రీ చేసి వ్యవసాయం చేస్తున్నవాడివి... వ్యవసాయంలో ఏముందో నీకు తెలియదా? నువ్వే గిట్లంటేమన్నట్టు?” అన్నాడు.

“పోచన్ననెందుకు దబాయిస్తున్నవు? ఊళ్లో చారెడు భూమి లేకుండ అమ్ముకొని పొమ్మంటె సంబరపడుదువా?” అన్నాడు కొండయ్య కోపంగా.

లక్ష్మణ్ స్వార్థపరుడేం కాదు. వ్యవసాయ కుటుంబం నుంచే వచ్చినా ఆ పని కూడుబెడ్తుందన్న నమ్మకం మాత్ర మాతనికి లేదు. అతివృష్టి, అనావృష్టి... కొనబోతే కొరివి... అమ్మబోతే అడివి... ధరల గడబిడ అన్ని తెలిసే మిత్రుడు తండ్రికి మద్దతుగా మాట్లాడటం లక్ష్మణ్‌కు బాధాకరంగా ఉంది.

తన వాళ్లంతా భూమినే నమ్ముకొని బతికారు. ఉన్న భూమిని అమ్ముకొని పట్నంలో కృత్రిమమైన బతుకు బతుకాలంటున్నాడు కొడుకు... భూమి లేకుండా ఉండడమెంత నామర్దా? భూమంటే ఊరు... ఊరంటే చిరునామా. వంశవృక్షం... గౌరవమర్యాదలు... కొడుకెందుకిలా ఆలోచిస్తున్నాడు?

కొండయ్య గుండెలనిండా ఆవేదన...

“భూముంటే వచ్చే గొప్పేంటి? అందులో ఏం పంటొస్తుంది? ఆ భూమమ్మి డబ్బుల్ని బేంకులేసుకుంటే వచ్చే వడ్డీలో సగం కూడా పంటపై రాదు.

వంట పండనప్పుడింకా నష్టమే కదా..."

లక్ష్మణ్ మాటలకు మరింత మండిపడ్డాడు కొండయ్య.


"ఇదీ చదువుకున్న తెలివి? భూమమ్మి బేంకులేస్తడట. మిత్తితోని బతుకుతాడట... అందరూ ఇట్లానే ఆలోచిస్తే వ్యవసాయాలు చేసేదెవ్వలు? పంటలెట్ల పండుతయి? మనుషులేం తింటారు? ఏం మాటలు మాట్లాడ్తున్నవురా కొడుక..." అని తిట్టరాని తిట్లు తిట్టాడు కొండయ్య.

లక్ష్మణ్‌కు ఉక్రోశంగా ఉంది

పోచన్నకూ లక్ష్మణ్ మాటలు నచ్చలేదు.

"ఇదుగో.. లక్ష్మణ్ణా...! వ్యాపారపుటాలోచనల రీత్యా లాభనష్టాల లెక్కల్లో చూస్తే నీ లెక్కలు సరైనవేనేమో! కాని మీనాన్నలాంటివాళ్లు వ్యవసాయాన్ని వ్యాపారంగా చూడరు... అదొక సామాజిక బాధ్యతనుకుంటారు... జీవరాశులు బతకాలంటే తిండి కావాలికదా! మరి





selvaraaj

మనుషులకు తిండెలా వస్తుంది? వ్యవసాయం ద్వారానే కదా! ఆ వ్యవసాయం చేసేదెక్కడ? భూమ్మీదనే కదా..! అలాంటి వ్యవసాయాన్ని భూమిని కలిగుండటాన్ని వ్యాపారమనుకుంటే ఎలా చెప్పు? మనం నాగరికులమని చెప్పుకునేవాళ్లం లాభనష్టాల ఆలోచనలను ఒంట బట్టించుకొని వ్యవసాయాన్నీ అలాగే చూస్తున్నాం. అందుకే ఈ దుఃఖం... ఇలాంటి ఆలోచనలు! మీ నాన్నకింకా అలాంటి ఆలోచనలు రాలేదు" అన్నాడు.

తనతో డిగ్రీ చదివి ఊళ్లో వ్యవసాయాన్ని చూసుకుంటున్న పోచన్న తన తండ్రితరం వాడిలా మాట్లాడటం లక్ష్మణ్‌కు ఆశ్చర్యకరంగా ఉంది.

"ఆ... మాటలకేంటి? ఎన్నయినా చెప్పవచ్చు"

"లక్ష్మణ్... నేను పొలమమ్మి బేంకులో డబ్బులేసుకుని నిన్ను భూములుంచుకొమ్మనడం లేదుగదా! నేను చేస్తున్నదే చెబుతున్నాను. అయినా ఈ విషయంలో ఎవరికివారే నిర్ణయించుకోవాలిగాని ఒకరు చెప్పడమేంటి? అయితే ఒక్క విషయం... చదువున్నంత మాత్రాన భూమికి, ఊరుకు దూరం కావాలా? నీకు భూమితో సంబంధాలుంటే తప్పా?" అన్నాడు పోచన్న.

"ఏం పొడయింది భూమిలో...? భూముంటే వచ్చేదేంటి?" అన్నాడు రాఘవ. లక్ష్మణ్‌తో కలిసి పని చేస్తున్నాడతను. అక్కడున్న కొద్దిమంది మాకెందుకులే అని వెళ్లిపోయారు.

"భూమి ఏమిస్తుందని ఎంత తేలికగా అన్నావు రాఘవా? గౌరవం... ఆత్మాభిమానం... ఆత్మవిశ్వాసం... మహాభారతయుద్ధం దేనికోసం జరిగింది. పోరాటాలన్నీ ఎందుకోసం జరుగుతున్నాయి?"

పోచన్న దిక్కు ప్రశంసాపూర్వకంగా చూశాడు కొండయ్య.

"భూమి మనిషి విలువను పెంచుతుందో లేదో కాని అప్పులనైతే పెంచుతుంది. నేను భూమి వద్దంటున్నది ఆ ఒక్క కారణంతోనే కాదు. నాన్నకు చేతకాకుంటవుతుంది కదా! ఇంకా వ్యవసాయమని ఆరాటమెందుకని?"

"అబ్బో... నా మీదెంత ప్రేమ కొడుక్కు? నాకు పనిచేయడమే ఇష్టం... కష్టపడి చదివించినందుకు ఎట్లంటున్నాడో చూడు" అన్నాడు కొండయ్య.

మామ మాటలకు గంయ్‌మని లేచింది కమల.

"ఓ చదివించారు ఇంత పొడుగు? ఎవ్వలన్న చదివించిండ్రా? మరి మీ తీరుగనే మమ్ములగూడ మట్లె బొర్లుమంటారా?" అంది.

కోడలు మాటలకు ధీటుగానే సమాధానం చెప్పాలనుకుంది వీరమ్మ.

"మట్లె బొర్లుమని మిమ్ములనెవ్వలన్నరు? మేమే బొర్లుతం... మా భూమి మాకుండ నియ్యలేరు" అంది.

"అయితే మమ్ములనప్పులపాలు కమ్మంటారా?"

"తల్లీ! మీ జీతం నుంచి ఒక్క రూపాయి కూడా పంపకుండ్రి. మేమే భూమి ఆధారంగానే బతుకతం. మీకు మీరు బతుకుండ్రి."

"సరేనా బిడ్డ.... మీ మామ చెప్పింది విన్నవుగదా! మీరు బంగ్లాలు గట్టుకుంటారో ఏం జేసుకుంటారో మీ ఇష్టం... మేమయితే భూమినే నమ్ముకొని బతుకుతం" అంది వీరమ్మ.

మధ్యలో కల్పించుకున్నాడు పోచన్న.

"లక్ష్మణ్ణా! నువ్వు భూమి పుత్రుడివై ఉండీ భూమిని కాదనడం" అన్నాడు.

"పోచన్నా! చెప్పడానికి సెంటిమెంట్లు బాగానే ఉంటాయి. భూమి భూమంటూ భూమ్మీదనే ఉండమంటావా? మట్టిబతుకులే బతకమంటావా? ఇప్పుడు మేముంటున్నది భూమ్మీద కాదు... రెండవ అంతస్థులో..." అన్నాడు రాఘవ.

మిత్రుని మాటలకు ఉబ్బిపోయాడు లక్ష్మణ్.

"అట్లానోయ్ రాఘవ... నువ్వు గాల్లోనే ఉంటున్నానంటవు... మరి మీరుంటున్న ఆ అంతస్థుల బంగ్లా పునాదులెక్కడున్నయో నీకు తెలియదా? భూమ్మీదనే కదా! అందుకే నేలవిడిచి సాము చేయవద్దనేది... భూమి మనకెంతో బాసటగా ఉంటుంది. ఆపదలో ఆదుకుంటుంది"

"పోచన్నా! నీ వాదం బాగానే ఉంది కాని ఈ భూమి విలువ పట్నంలో ఉన్న భూమితో పోలిస్తే ఎంత? ఇక్కడ ఎకరం భూమమ్మినా అక్కడ ఒక 'కుంట' భూమి రాదన్న విషయం నీకు తెలియదా?"

కొడుకు వాదనలో ఏదో లోపమున్నట్టనిపిస్తుంది కొండయ్యకు. కానా విషయాన్ని వివరించి చెప్పే చదువు, తెలివి ఆ భూమిపుత్రుడికి లేవు. ఆ విషయాన్ని పోచన్న వివరించాడు.

"గ్రామాల్లోని భూమి విలువ ఏ విధంగా తక్కువంటున్నావు? అవి అమ్ముతున్న రేట్లను బట్టా? పట్టణాలలోని భూమి ఎందుకు పనికొస్తుంది? ఇల్లు కోసమే కదా? అందుకోసం లక్షల్లో ఖర్చు చేయాలి. ఊళ్లోనయితే తక్కువ ఖర్చుతో ప్రకృతి మధ్య జీవించినట్టుంటుంది. మరా లక్షల డబ్బు ఎందుకు పెట్టినట్టు? పోతే గ్రామాల్లోని భూమిలో ప్రతియేటా పంట పండుతుంది. అందులో పండే పంటకు ధర కట్టుకుంటూ పోతే లక్షలు దాటదా? ఎందుకంటే అది తరతరాలుగా పంటనిస్తూనే ఉంది. ఇప్పుడు చెప్పు... ఏ భూమి విలువ ఎక్కువంటావు?"

పోచన్న మాటలకు వాళ్లంతా విస్తుపోయారు.

"నీ మాటలు వాదం కొరకైతే బాగానే ఉన్నాయి కాని జీవితమంటే తర్కంకాదు పోచన్నా! ఇంతకూ భూమిని ప్రేమించడమంటే గ్రామాల్లోని ఫ్యూడల్ సంస్కృతిని ప్రేమించడమే కదా! గ్రామాల్లో ఉండేవి ఫ్యూడల్ భావాలే కదా! దాన్ని పెద్దగా చేసి చెబుతున్నావు నువ్వు..."

తాను అతి తెలివిగా మాట్లాడి మిత్రున్ని దెబ్బ కొట్టాననుకున్నాడు లక్ష్మణ్.

"అలాగా! నీకు గ్రామాల్లో కనబడింది ఫ్యూడల్ సంస్కృతొక్కటేనన్నమాట. గ్రామీణ సంస్కృతిలో మానవతాస్పర్శ, పరస్పర సహకారం, ఆత్మీయతలేవీ కనబడటం లేదు. ఊరంటే ఓ సమూహం... ఓ నాగరికత... కొన్ని వంశాలకు చిరునామా... గ్రామాలు సంస్కృతీ కేంద్రాలు... ఏ దేశ సంస్కృతయినా బతికుండేది గ్రామాల్లోనే. కృత్రిమానికి ఆమడదూరంలో ఉండే గ్రామాలు నీకు మాత్రం ఫ్యూడల్ కేంద్రాలు మాత్రమే... అంతేనా లక్ష్మణ్? పట్టణాల్లో కంటె ఫ్యూడల్ సంస్కృతి కొంతెక్కువే ఉన్నా గ్రామాల్లోని ప్రేమలు, ఆత్మీయతలు, అనురాగాలు ఎక్కడ దొరుకుతాయి?" మిత్రుని మాటల్ని తుత్తునియలుగా ఖండించాడు పోచన్న. లక్ష్మణ్ ముఖం చిన్నబోయింది.

"అంటే? వృత్తుల్లోని వివక్షను భరిస్తూ సాంప్రదాయవృత్తులు చేసుకుంటూ గ్రామాల్లోనే ఉండాలంటావా పోచన్నా?" అన్నాడు రాఘవ.

"అని ఎవరన్నారు? వృత్తుల్లోని వివక్షను నేనెప్పుడూ సమర్థించను. పనికి విలువనివ్వడం పెరిగితే గ్రామాల ప్రాముఖ్యత మరింత పెరుగుతుంది. నేననేది గ్రామం దేశానికి ఆహారాన్నందించే అన్నపూర్ణ... మీరు చేస్తున్న ఫ్యాక్టరీ ఉద్యోగం మాత్రం వృత్తి పని కాదా? తేడా ఎక్కడంటే మనిషికి బదులు యంత్రాలు పనిచేయడం... పరిశ్రమలు వృత్తులు కాక మరేంటి?"


"అక్కడ కులాలబట్టి పనుండదు కదా?"

"ఇక్కడ కూడా చాలామంది వృత్తులు కోల్పోయిన వాళ్లూ వ్యవసాయమో, వ్యవసాయధారిత పనో చేసుకుంటూ బతుకుతున్నారు కదా! వెలుమలు, రెడ్లు, కాపులు, కోమట్లు, శూద్రకులాల వారు, ఎస్సీఎస్టీలంతా గ్రామాల్లో వ్యవసాయాధారిత పనులతోనే బతుకుతున్నారు. అంటే మన దేశంలో ఇప్పటికీ మెజారిటీ జనాలు భూమి ఆధారంగానే బతుకుతున్నట్టు కదా?"

"లక్ష్మణ్ణా! నువ్వెన్ని చెప్పినా భూమిని అమ్మడం సరైంది కాదంటాను నేను... కొంచెం చదువొస్తేనో, ఉద్యోగం చేస్తేనో భూమికి దూరం కావాలనుకోవడం చాలా తప్పు. భూమిపై ప్రేమ ఉండటం అభివృద్ధి నిరోధకం కానేకాదు"

ఆ మాటలు ఆలోచనాత్మకాలేననిపించాయి లక్ష్మణ్‌కు. అయినా అంత సులభంగా ఒప్పుకోదలచుకోలేదు.

"అందరూ భూముల్ని వదిలించుకుంటూ పీడ విరగడైపోయిందన్నట్టు గ్రామాలొదిలి పోతుంటే నువ్వేమో భూమి భూమని దాని మీద అపారమైన ప్రేమ కనబరుస్తున్నావు. మన నాన్నల తరం వేరు కాని నువ్వు అదే మాటంటున్నావు. ఏం చూసో తెలియడం లేదు. నేనూ లక్ష్మణ్ ఒకేచోట ఉద్యగం చేస్తున్నాం కదా! నేను ఊర్లో చారెడు భూమి లేకుండా అమ్మి పారేస్తాను. డబ్బు బాంకులో వేస్తాను. దాన్నెలా పెంపు చేస్తానో చూడు. భూముంచుకున్న లక్ష్మణ్ కంటె ఎక్కువ సంపాదించి చూపెడతాను. ఛాలెంజ్ చేస్తున్నాను. అప్పుడు నువ్వు, నీ మాట వింటే లక్ష్మణ్ తప్పకుండా పశ్చాత్తాపపడుతారు" అన్నాడు



రాఘువ.

రాఘువ మీదికురకబోయిన కొండయ్య్యని ఆపాడు పోచన్న.

"రాఘన్నా! భూమినా యింత అమ్ముకొమ్మనేనా నువ్వు చెప్పేది" అంది వీరమ్మ.

"ఎవ్వల ఉద్దేశ్యం వాళ్లది" అన్నాడు లక్ష్మణ్.

"ఏదేమైనా కాపుబిడ్లకు భూమిని అమ్మాలన్న ఆలోచన రావడమేం బాగాలేదు. మనలో వ్యాపార మనస్తత్వం పెరగడం వల్ల, అన్ని పనులనూ వ్యాపారంగా భావించడం వల్ల లక్ష్మణ్‌లో ఇలాంటి ఆలోచనలొస్తున్నాయి. లక్ష్మణ్ణా ఇదువరకే కొంత భూమమ్మాడు. మిగతా భూమి కొండయ్య్య పటేలు బతికున్నంత వరకైనా అమ్మడానికి వీల్లేదు. ఆయనకు చేతనైనంత వరకు వ్యవసాయం చేసుకుంటాడు. చేతకాకుంటే దున్నించుకుంటాడు. లక్ష్మణ్ తన ఇష్టమైతే తల్లిదండ్రులకు ఐదోవదో ఇవ్వనీ, లేకుంటే లేదు. పెద్ద మనుషులకు భూమ్మీదున్న మమకారాన్ని బలవంతంగా తుంచివేయడం మంచిదిగాదు..."

లక్ష్మణ్ ముందటికాళ్లకు బంధం వేశాడు పోచన్న...

గొణుక్కుంటూనే ఆ మాటలకొప్పుకున్నాడు లక్ష్మణ్.

"ఎన్నటికైనా చావులేంది భూమి" అన్నాడు కొండయ్య్య.

"చావో బతుకో రేపు మీరంతా పశ్చాత్తాప పడాల్సివస్తుంది" అని లేచి వెళ్లిపోయాడు రాఘువ.

000

కొన్నేండ్లు కాలగర్భంలో కలిసిపోయాయి. సమాజం డబ్బు దిక్కు పయనిస్తున్న సూచనలు స్పష్టంగా కనబడుతున్నాయి. వస్తుసంస్కృతిపై మోజూ పెరిగింది. కార్లు, మేడలున్న వాళ్లే సుఖపడ్తున్నారన్న భావం సర్వత్రా వ్యాపిస్తుంది. రాఘువ ఊళ్లో ఉన్న భూమంతా అమ్మేశాడు. ఆ డబ్బును గుణింతాలుగా మార్చే ప్రయత్నంలో ఉన్నాడు. రాఘువ, లక్ష్మణ్ ఇద్దరూ ఉద్యోగాల వల్ల మధ్యతరగతికెదిగారు. ఇంకా ఎదుగుతున్నారు. పోచన్న మాత్రం అలాగే బతుకుతున్నట్లు కనబడ్తున్నాడు. తాము బాగా సుఖపడ్తున్నామని పోచన్న భూమిని నమ్ముకొని నష్టపోయాడని భావిస్తున్నారు వాళ్లు. ఈసారి తాను కూడా రాఘువలా ఊళ్లోని మొత్తం భూమిని అమ్మి పారేసి డబ్బును గుణింతాలుగా మార్చాలనుకుంటున్నాడు లక్ష్మణ్. తండ్రి మరింత వృద్ధుడయ్యాడు కాబట్టి తన పని మరింత సులభతరమవుతుందనుకుంటున్నాడు. ఇప్పుడా పనిమీదనే ఊళ్లోకొచ్చాడు.

కొండయ్య్య ఇంటి అరుగుమీద వాల్చున్న మంచాల్లో వాళ్లంతా కూర్చున్నారు. లక్ష్మణ్, రాఘువ విలువైన దుస్తులు ధరించున్నారు. వాళ్ల ముఖాల్లో గర్వం తొణికిసలాడుతోంది. పోచన్న ముఖంలో ప్రశాంతతుంది. అతని శరీరంపై మామూలు దుస్తులున్నాయి. వృద్ధుడైన కొండయ్య్యలో ఏ భావమూ కనబడటం లేదు.

"ఏమైందిప్పుడు? భూమి భూమని అపార ప్రేమను చూపావు. భూమినే నమ్ముకొని ఉండటం వల్ల భూమ్మీదనే ఉంటున్నావు. మరి మా సంగతి చూడు"

లక్ష్మణ్ మాటలకు చిన్నగా నవ్వాడు పోచన్న. "ఏంటీ? నాకేమైందనుకుంటున్నారు మీరు? నా మట్టుకు నేనైతే హాయిగానే ఉంటున్నాను. నా భూమిని సాగుచేసుకుంటూ, కాపాడుకుంటూ నా తల్లిదండ్రులతో బంధుమిత్రులతో కలిసి హాయిగా బతుకుతున్నాను. నేనైతే మీరు ఎంతో కొంత నష్టపోయారనుకుంటున్నాను. ఊళ్లకు దూరమై, అయినవాళ్లకు దూరమై మరి కొందరైతే తల్లిదండ్రులను చూడకుండా బాధకు గురిచేస్తూ... కాదంటారా...?" అన్నాడు.

వాళ్లకేం మాట్లాడాలో తోచడం లేదు.

"అవును... పోచన్న ముసలివాళ్లైన తన తల్లిదండ్రులకు అండగా ఉంటున్నాడు. తన తోడబుట్టిన వాళ్లను అరుసుకుంటున్నాడు. అందరికీ తలలో నాల్కలా ఉంటున్నాడు. మీలా వేలు సంపాదించకపోవచ్చు. కాని ఏం తక్కువైంది పోచన్నకు?"

"అంటే నౌకర్లు వదలిపెట్టి ఊళ్లోనే ఉండమంటావా కొండయ్య్య బాపు?"

"అని ఎవరన్నారు రాఘువా! కాని భూమితో, కన్ననేలతో, ఊరుతో సంబంధాలు తెంపుకోవద్దంటున్నాం. ఇక్కడ పండుగల్లో పబ్బాల్లో కలిసి తినడంలో, కలిసివుండటంలో ఎంత ఆనందముందో మీకు తెలియదా?"

పోచన్నను జయించడం వాళ్లకు కష్టంగానే ఉంది.

"పోచన్నా భూమి గూర్చి మేమంటుంటే నువ్వేమో ఊరు గురించి మాట్లాడుతున్నావు. ఇవన్నీ నిన్ను నువ్వు సంతృప్తి పరుచుకోవడానికే... ఇంతకాలంగా భూమిని నమ్ముకొని నువ్వు సంపాందించిందేంటి?"

"లక్ష్మణ్ణా! మీ జీవితంలోలా తళతళలు, మిలమిలలు ఉండకపోవచ్చు. కానీ సాఫీగా, హాయిగా బతుకుతున్నాను. నా పిల్లల్ని చదివించుకుంటున్నాను. పాత ఇల్లు స్థానంలో కొత్త ఇల్లు కట్టుకున్నాను. నా వాళ్లందరి మధ్యా హాయిగా బతుకుతున్నాను. రేపు పిల్లల పెళ్లిళ్లవీ నాకున్న ఆదాయంతోనే చేస్తాను. నాకైతే బాగానే బతుకుతున్నట్టనిపిస్తుంది"


అదీ ఒక బతుకేనా అన్నట్టు చూశారు వాళ్లతన్ని...

"మేం పట్నంలో ఇండ్లు కట్టుకోబోతున్నాం. ఇలాంటి గూనపెంకల ఇండ్లు కాదు. బంగ్లాలు. మా పిల్లల్ని కాన్వెంట్లలో చదివిస్తున్నాం. భూమి అమ్మితే వచ్చిన డబ్బును ఎన్నో రెట్లు పెంచుతున్నాం. నువ్వెంత కాలం కష్టపడ్డా మా అంత సంపాదించగలవా? పట్నంలో ఇల్లు కట్టగలవా?"

సవాల్ చేస్తున్నట్టన్నాడు రాఘువ.

"మీరు నష్టపోయారని, నాలాగే ఉండాలని నేను చెప్పడం లేదు. కాని డబ్బును జమ చేయడం అనేది ఓ పద్ధతి. నెమ్మదిగా సాగేది. న్యాయసమ్మతమైంది. నా పద్ధతే ఇష్టం. డబ్బును గుణింతాలుగా మార్చడంలో ఏదో మోసముంది. గుణింతాలతో వచ్చే డబ్బు, ఆ పద్ధతులు ఎంతో కాలముండదు. షేర్ల మాయాజాలం, ఫైనాన్సుల దగాలు, బోగస్ వ్యాపారాల ద్వారా సంపాదించడం న్యాయమని నేననుకోను. అదెంతో కాలం ఉండదు. అందులో పెద్ద రిస్క్ ఉంది.

నేను పెంకుటిల్లు కట్టుకున్నాను. మీరు పెద్ద బంగ్లా కడ్తారనుకుందాం. ఆ వేడిని తట్టుకోవడానికి కూలర్లు, ఏ.సీలు, కావాలి. అంటే మేం ప్రకృతి దగ్గరగా ఉండే మీరు ప్రకృతికి విరుద్ధంగా పోతున్నారన్నమాట. మీరు బాగా సంపాదించి తినేదేమిటి? రోగాలను



పెంచే వేపుల్లు, ఇంకేవో... పచ్చికంకులు, ప్రకృతిసిద్ధమైన పండ్లు, పచ్చి పెసర, పచ్చి పల్లికాయల్లాంటివి తినడానికి మీరు వందల్లో ఖర్చు చేయాలి. మాకా బాధ లేదు. లేత పొట్టేలుమాంసం, దేశికోడి కూర మీరు తినాలనుకున్న తినలేరు. ప్రకృతిసిద్ధమైన బతుకు మాకుంది. అందులో ఎన్నో ప్రయోజనాలున్నాయి.

డబ్బు సంపాదించడం తప్పేంకాదు. కాని ఆ డబ్బును గుణింతాలుగా మార్చడంలో మోసముంది. జమలయితే ఫర్వాలేదు. నేను చేసేదదే. గుణింతాల పద్ధతిలో ఎవరెప్పుడు మునుగుతారో తెలియదు."

పోచన్న మీద దాడి చేసి గెలవాలనుకుంటున్న వాళ్లకు అతనే తమ నోళ్లు మూయించడం మింగుడు పడటం లేదు. వ్యవసాయం చేస్తూ బతికే పోచన్న ముందు ఉద్యోగాలు చేస్తూ బతికే తామోడి పోదలుచుకోలేదు.

"అంటే నువ్వనేదేంటి? పైకి రావడం తప్పంటావా?"

"అని ఎవరన్నారు? కాని, పైకి రావడమంటేంటో నిర్ణయించుకోవడంలోనే ఉంది పంచాయతంతా. మన దేశ వాతావరణానికి బొంతల్లాంటి జీన్‌పాంట్లవసరమా? సూట్‌బూట్లతో వచ్చేదేంటి? చెమటే కదా! అభివృద్ధంటే మోసం కాకూడదు. ప్రారంభమైన ఒకటి రెండు నెలల్లోనే షేర్ విలువ పదిరిపై రేట్లు పెరుగుతుంది? ఎక్కడో ఓచోట ఎంతో మంది మునగాల్సిందే కదా! ఫైనాన్స్‌లు సంగతీ అంతే. నా దగ్గర డబ్బు మిగిల్తే పోస్టాఫీస్‌ల్లోనో, సాధారణ వడ్డీ ఇచ్చే బ్యాంకుల్లోనో వేస్తాను. అవి ఐదారేండ్లలో రెండింత లవుతాయి. ఇది అభివృద్ధి కాదా? మీరనేదాంట్లో ఎన్ని సమస్య లున్నాయి? సరిగ్గా ఆ తేడాయే పట్టణ తళుకుబెళుకులకు, పల్లెకూ ఉంది"

పోచన్న మాటలకు వెన్నులోంచి వణుకువస్తోంది వాళ్లకు.

"ఎక్కడేసిన గొంగళి అక్కడున్నట్టే నువ్వుండదలుచుకుంటే ఉండు. కాని నీలా మమ్మల్ని ఉండమనకు. మేం కొన్న ఇంటి జాగా విలువ రెండేళ్లలో ఐదు రెట్లయింది . అందులో ఇండ్లు కట్టుకుంటాం. లేదా ఇంకా ధర పెరిగితే అమ్ముకుంటాం. భూమినే పట్టుకొని వేళ్లాడే నువ్వు ఎన్నేండ్లైనా ఆ ప్లాట్ విలువ చేసే డబ్బయినా సంపాదించగలవా? నీ లాంటివాళ్లు ఆ మట్టివాసనలోనే సుఖమనుకుంటారు. మేం మాత్రం షేర్లు, ఫైనాన్సులు అన్ని మార్గాల ద్వారా అభివృద్ధి చెందుతాం" అన్నాడు రాఘువ.

వాళ్లకెన్ని చెప్పినా లాభం లేదని అర్థమైంది పోచన్నకు.

"సరే... మీరింకా ఇంకా సంపాదించండి. చాలా సంతోషిస్తాను. కార్లు కొనండి. మరీ మంచిది. నాకున్న స్కూటర్ చాలు. నాకు నా జీవితవిధానం, సంపాదనపై తృప్తుంది. నా పిల్లల్ని వాళ్లు చదువుకున్నది చదివిస్తాను. వాళ్లేం చేసినా ఈ దేశంలోనే ఉండేట్టు చూసుకుంటాను. మీ అపరిమిత సంపాదనతో మీ పిల్లల్ని విదేశాలకు పంపిస్తారో ఏం చేస్తారో మీ ఇష్టం"

"అంటే నీ పిల్లల్ని నీలాగే మట్టివని చేయమంటావా?"

"దేశంలో ఉంచుకోవడమంటే మట్టివని చేయడమా? మట్టివని చేస్తే మాత్రం తప్పా? వాళ్లు చదువగలిగింది, ఇష్టమున్నది చదివిస్తాను. ఈ పనే చేయమని మాత్రం నేనాదేశించను. ఏం చేస్తూ బతకడమన్నది వాళ్లిష్టమే. అయితే వాళ్లేం చేస్తూ బతికినా నేలను మరిచిపోకుండా ఉండేట్టు చూస్తాను. నేలను నమ్మితే నష్టం లేదని నిరూపిస్తాను. భూమెప్పుడూ మోసం చేయదని రుజువు చేస్తాను. ఏదైనా మోసమంటూ జరిగితే అది మనిషి చేసే మోసమే కాని భూమి చేసేది కాదు. వ్యవసాయంలో కనబడని కుట్రంతా మనిషివల్ల జరిగేదే"

తన అభిప్రాయాలను ఖచ్చితంగా చెప్పేశాడు పోచన్న. స్పష్టంగా, నిర్మొహమాటంగా ఎన్నో విషయాలను చెప్పిన పోచన్న దిక్కు విస్మయంగా చూస్తున్నారు వాళ్లు. కొండయ్యకైతే అతనికి చేతులెత్తి దండం పెట్టాలనిపిస్తోంది. లక్ష్మణ్, రాఘవకేం మాట్లాడటానికీ నోరు రావడం లేదు.

"ఒకప్పుడు దళితులు మీకు గ్రామాలు గొప్పవేమో మాకైతే కాదనే వారు. మాకేమున్న భూములా, జాగాలా? ఇండ్లా, స్థలాలా? అనేవారు. వాళ్లిప్పుడు భూములు సంపాదించుకుంటున్నారు. నేలను స్వంతం చేసుకుంటున్నారు. ఉన్నవాళ్లు ఊళ్లు, దేశాలు వదిలిపోతుంటే శ్రామికకులాలు వాళ్లు, దళితులు ఊళ్లలో భూములను నమ్ముకొనుంటున్నారు. పోయేవాళ్లంతా భూమ్మీద ప్రేమ లేని వాళ్లు, కాకుంటే పైపై మెరుగులను చూసేవారు.

మీరు బాగా సంపాదిస్తున్నామంటున్నారు. చాలా సంతోషం. నాకు మాత్రం ఈ బతుకులోనే సంతృప్తి ఉంది. నా గ్రామంలో భూమిని కలిగి ఉండడం ఆనందంగా ఉంది. నాకున్న ఈ సంపాదన చాలు. మరి మీకు తృప్తుందో లేదో నాకు తెలియదు" అన్నాడు పోచన్న.

పోచన్న ఎన్ని చెప్పినా డబ్బు వ్యామోహం లక్ష్మణ్‌ను విననీయడం లేదు. భూమమ్మగా వచ్చిన డబ్బును గుణింతాలుగా మార్చాలన్నా కాంక్ష అతన్ని నిలువనీయడం లేదు. తండ్రితో అటోఇటో తేల్చుకోవడానికే నిర్ణయించుకున్నాడు.

"పోచన్నా! నీ తార్కికతకు జోహార్లు కాని నువ్వీ విషయంలో తలదూర్చకు. నీకున్న భూమి ప్రేమ అలాగే ఉండనీయ్. నీ వల్లనే మానాన్న భూమిని అమ్ముకోనివ్వడం లేదు. భూమిని ఉంచడం వల్ల వడ్డీ నష్టం వస్తుంది. సరే. మానాన్ననింత భూముంచుకొని మిగతాది నాకు పంచి ఇవ్వండి. నా భూమి నేనమ్ముకుంటాను. ఇంతకంటె చేసేదేం లేదు"

లక్ష్మణ్ మాటలకు లబోదిబోమని మొత్తుకుంటున్నాడు కొండయ్య. వీరమ్మయితే శోకం బెట్టి ఏడుస్తుంది. వాళ్ల నోదార్చాడు పోచన్న.


"ఇంచు భూమికూడియ్య. ఏం చేసుకుంటావో చేసుకో" అన్నాడు కొండయ్య.

"అది మా తాత నుంచి సంక్రమించిన భూమి. నువ్వు సంపాయించిందేం కాదు. ఆ భూమి నాకెలా రాదో చూస్తాను" అన్నాడు లక్ష్మణ్.

కొడుక్కు సగం భూమి పంచివ్వక తప్పలేదు కొండయ్యకు. దాన్నమ్ముకొని డబ్బు చేతబట్టుకొని వెళ్లిపోయాడు లక్ష్మణ్. ఆ డబ్బును తాను సంపాదించిన డబ్బును ఐదారు రెట్లు మార్చే ప్రయత్నం చేస్తున్నాడు.

000

మరికొన్నేండ్లు గడిచాయి. సమాజంలో అనేక మార్పులు. డబ్బుపై మోజు మరింత పెరిగింది. విలువలు, ఆదర్శాలనే మాట పిచ్చివాళ్ల ప్రేలాపనలుగా మిగిలాయి. ఎలాగైనా సరే విపరీతంగా డబ్బు సంపాదించాలన్న కాంక్ష. తద్వారా మోసాలు... ఫైనాన్స్ భాగోతాలు... ఎన్నో.... ఎన్నెన్నో.. మరో దిక్కు ప్రభుత్వ రంగ సంస్థల మూసివేత. వేలాదిమంది కార్మికులు రోడ్ల మీద నిల్చునే పరిస్థితి... అందులో భాగంగానే రాఘవ, లక్ష్మణ్ పనిచేసే కర్మాగారాన్ని మూసివేశారు. దుఃఖంలో ఉన్న



కొడుకు నోదార్చుదామని భార్యను, పోచన్నను తీసుకొని లక్ష్మణ్ దగ్గరకెళ్లాడు కొండయ్య. తండ్రిని పట్టుకొని భోరుభోరున ఏడుస్తున్నాడు లక్ష్మణ్. పక్క క్వార్టర్‌లో ఉన్న రాఘవ వచ్చి వాళ్లతో కూర్చున్నాడు.

రాఘవ, లక్ష్మణ్ ముఖాల మీద కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. ముందు గదిలో ఉన్న ఫర్నిచర్ బోసిపోయి నట్టుండటం గమనించాడు పోచన్న. వాళ్లు తీవ్ర సంక్షోభంలో ఉన్నట్టు గమనించాడు. కొద్దిసేపు అవీఇవీ మాట్లాడు కున్నారు. ఫ్యాక్టరీ మూతపడ్డా ఇదివరకే బాగానే సంపాదించుకున్న రాఘవ, లక్ష్మణ్ ఎందుకంత ఆందోళన చెందుతున్నారో అర్థం కావడం లేదు పోచన్నకు. అదే విషయం అడిగాడు.

"ఫ్యాక్టరీ మూతపడింది నిజమే. కాని మీరిది వరకే కావాల్సినంత డబ్బు సంపాదించి ఉంటారు. అదంతా ఏమయింది? కొన్నేండ్లుగా మీరు ఊరికి రావడంకూడా అరుదయింది కదా" అన్నాడు.

రాఘవ, లక్ష్మణ్ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"కరీంనగర్‌లో ప్లాట్లు కొన్నాం. అప్పుడే అమ్ముకున్నా బాగుండేది. ఇండ్లు కట్టుకున్నా బతికిపోయేవాళ్లం. ఇంకా ధర పెరుగుతుందన్న ఆశతో అలాగే ఉన్నాం. ఈలోగా వాడా భూమిని ముగ్గురికమ్మేశాడు. అలా ఆ ప్లాట్లు మునిగాయి. మా ఇల్లు కల అలా నాశనమై పోయింది.

ఆ మధ్య ఫైనాన్స్‌లు విపరీతంగా పెరిగాయి కదా! షేర్లజోరూ బాగానే ఉండేది. భూములమ్మితే వచ్చిన డబ్బును, మా దగ్గరున్న డబ్బును, ఆఖరుకు పి.ఎఫ్ నుంచి కూడా డబ్బు తీసి అందులో వేశాం. డబ్బును గుణింతాలుగా మార్చాలన్న దురాశతో వేశాం. ఆ డబ్బు గుణించబడిన మాట నిజమే. కాని దేంతో? సున్నాతో..... సున్నా ఇంటూ ఎనిథింగ్ ఈక్వల్‌టూ సున్నాయే కదా! అలా మేం సున్నాలుగా మారాం. షేర్ల సంగతి తెలిసిందే కదా! మేం పెట్టిన చాలా షేర్ల పేర్లు కూడా కనబడటం లేదు పేపర్లలో" అన్నాడు లక్ష్మణ్.

అతని ముఖం మరింత వాడిపోయింది.

"బాగా సుఖపడ్డామనుకున్నాం. పడ్తున్నామని భ్రమపడ్డాం. ముంచుకొస్తున్న ప్రమాదాలను గమనించలేకపోయాం. మేమే కష్టాలను కొనుక్కున్నట్టయింది" అన్నాడు రాఘవ.

వీరమ్మ, కమల కళ్ల నీళ్లు తీసుకుంటున్నారు.

"ఖచ్చితంగా ఇంజనీరింగే చదివించాలని అమెరికాకు పంపించాలని పట్టుబట్టి మరీ చదివించాం. మెరిట్‌లో సీటు రాక ఎన్నా పేమెంట్ సీట్లతో చదివించాం. అయితే వాళ్లు పోటీకి తట్టుకోలేకపోయారు. ఏదో పాసయిందనిపించారు. ఈలోగా అమెరికా అవకాశాలూ మృగ్యమయ్యాయి కదా! ప్రైవేటు ఉద్యోగాల వేటలో ఉన్నారు. మరో దిక్కు మా ఉద్యోగాలూడాయి. ఇంకొకడి చదువు పూర్తి కానే లేదు"

ఏటుకాని వయసులో ఉద్యోగం కోల్పోయిన కొడుకు పరిస్థితి చూస్తూ ఏమనలేక పోతున్నాడు కొండయ్య.

"నా పరిస్థితయితే మరీ ఘోరమైంది. ఎక్కడా చారెడు భూమి లేదు. ఉండటానికిల్లు లేదు. ఉద్యోగమూ లేదు. ఇంకో రెండు నెలల్లో ఈ ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలి. వి.ఆర్.ఎస్.తో వచ్చే స్వల్పమైన డబ్బు ఏ మూలకు సరిపోతుంది" అన్నాడు రాఘవ తలవంచుకొని.

అక్కడ వాతావరణం భారంగా ఉంది.

"ఇంతటి సంక్షోభంలో నువ్వా పల్లెటూళ్లో ఎలా నిలదొక్కుకోగలిగావు? నీ పిల్లలు జీవితంలో స్థిరపడ్డారా?" అన్నాడు లక్ష్మణ్.

గంభీరంగా తలూపాడు పోచన్న.

"నా పిల్లలు చదువగలిగింది, చదువతానన్నది చదివించాను. కొడుకులిద్దరూ లెక్చరర్లయ్యారు. కూతురు, అల్లుడు టీచర్లు. ఊళ్లో ఉంటున్నా అవసరమైన కొన్ని సౌకర్యాలను కల్గించుకున్నాను. ఏ విలాసాల జోలికి పోకుండా అతి సామాన్యంగా గడిపాను. నేను డబ్బుకు జమ చేయాలనుకున్నానే కాని గుణింతాలు చెయ్యాలనుకోలేదు. అందుకోసం భూమి కొనడం, ప్రభుత్వ బాంకుల్లో వేయడం చేశాను. పోచంపాడు కాలువ నీళ్లు వచ్చింతర్వాత వ్యవసాయాలు మెరుగయ్యాయి. నేను భూమినే మాత్రం అమ్మలేదు. ఇప్పుడు భూమి ధర చాలా పెరిగింది. నా భూముల ధర లక్షల్లోనే ఉంటుంది. మీ వి.ఆర్.ఎస్. డబ్బులతో రెండెకరాల భూమి కూడా కొనలేరు. అప్పుడే నేను భూమిని అమ్ముకొనుంటే నా ఆస్తి 30 లక్షలకు పైగా అయ్యుండేది కాదు.

భూమిని దక్కించుకోవడానికి, ఖర్చులు తట్టుకోవడానికి వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాను. కూరగాయలు పండించడం, మిర్చి పండించడం లాంటివన్నీ చేశాను. బేరగాళ్లు నా తోట్లో కొచ్చి కూరగాయలు కొనుక్కుపోతుంటారు. నాలుగైదు బర్లు కొని పాలమ్మడం చేశాను. పాలవానొచ్చి పాలు తీసుకుపోతుంది. ఇలా నేను భూమినే నమ్ముకొని బతికాను. నన్ను భూమేం మోసం చేయలేదు."


తన విజయ రహస్యాన్ని వివరించాడు పోచన్న. నేలను నమ్ముకున్న పోచన్న హాయిగా ఉండటం, అమ్ముకున్న తాము రోడ్డు మీద నిలబడటం వాళ్లకు వింతగా ఉంది. ఈ వయస్సులో తామెలా బతకాలో వాళ్లకర్థం కావడం లేదు. బతుకు అగమ్యగోచరంగా కనబడుతూ వాళ్ల కళ్లవెంట పటపటా నీళ్లు కారుతున్నాయి.

అప్పుడు కొడుకును దగ్గరకు తీసుకున్నాడు కొండయ్య. పంచెతో కొడుకు కండ్లు తుడిచాడు.

"లక్ష్మణ్ణా! నీ ఉద్యోగం పోతే పోయింది. మనం బతకలేకపోం. ఎంతయినా కాపుదనపోల్లం కదా! మా పాలుకని ఉంచిన ఐదెకరాల భూమి అట్లనే ఉంది. ఒక్క గజం కూడా అమ్మలేదు. ఊళ్లో ఇల్లు కూడా ఉంది. అంటే నీకిప్పుడు భూమి, ఇల్లు ఉన్నట్టే కదా! నీ పిల్లల్ని, కోడల్ని తీసుకొని ఊరికి వచ్చేసెయ్యి. దానిమీద బతికితే బతుకు. లేకుంటే భూమమ్ముకో. ఇప్పుడు ఎకరం ధర లక్షన్నరుంది. అప్పుడేమో అగ్గుసగ్గు కమ్ముపోతివి. ఆ భూమిని ఇల్లు ఏం జేసుకున్నా నీ ఇష్టమే. మిమ్మల్ని తీసుకుపోదామనే వచ్చినం మేం" అన్నాడు కొండయ్య.

వీరమ్మ భర్తను సమర్థించింది. తల్లిదండ్రు లను పట్టుకొని ఏడ్చిఏడ్చి పునీతు డయ్యాడు లక్ష్మణ్. తాను ఏ నేల నయితే వద్దను కున్నాడో ఆ నేలే అక్కున చేర్చుకోవ డం లక్ష్మణ్‌కు భరించరాకుండా ఉంది.

తండ్రి రెండు పాదాలనూ స్పృశించాడు.




రాఘవ మాత్రం ఒంటరిగానే మిగిలాడు. అతనికి నమ్ముకున్న నేలా లేదు... నేలను నమ్మిన తండ్రే లేడు. ఏం చేయాలో తోచక బిత్తరపోయి చూస్తున్నాడు.

ఆ చూపు నేలను నమ్ముకున్న పోచన్న దిక్కు మర్లింది. ఆ చూపులో ఎంతో ఆశ, అర్థాలున్నాయి. వాటిని అర్థం చేసుకునే శక్తి ఒక్క పోచన్నకే ఉంది. ■